


వడ్డెరల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్



సమావేశంలో పాల్గొన్న వడ్డెర కులస్తులు

# చదువుకుంటేనే సమాజంలో ఉన్నత స్థానం

- ఎమ్మెల్యే జాజాల సురేందర్
- ఎల్లారెడ్డిలో వడ్డెరల ఆత్మీయ సమ్మేళనం

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 8: చదువుకుంటేనే సమాజంలో ఉన్నత స్థానం లభిస్తుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. వడ్డెరల ఆత్మగౌరవాన్ని పెంపొందించడానికే నియోజకవర్గ స్థాయి వడ్డెరల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన నియోజకవర్గస్థాయి వడ్డెరల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వడ్డెరలకు రాళ్లను పిండి చేసే శక్తి ఉన్నా.. చదువులేకపోవడంతో సమాజంలో నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. చదువుకుంటేనే రాజకీయంగా, ఆర్థికంగా ఎదగవచ్చని తెలిపారు. తనను మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేయిస్తానని భరోసా ఇచ్చారు. పక్కనే ఉన్న కామారెడ్డి నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడంతో ఎల్లారెడ్డి నియోజకవర్గం కూడా ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జాజాల సురేందర్, వడ్డెరల ఆత్మగౌరవ సముదాయ ట్రస్ట్ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణను వడ్డెర సంఘం ప్రతినిధులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వడ్డెర ఆత్మగౌరవ సముదాయ ట్రస్ట్ వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు సంపెంగి నాగయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు, వడ్డెర సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువకులకు స్పోర్ట్స్ కిట్ల అందజేత

తాడ్వాయి, అక్టోబర్ 8: మండలంలోని క్రిష్ణాజివాడి గ్రామ క్రీడాకారులు, యువకులకు ప్రభుత్వం మంజూరు చేసిన స్పోర్ట్స్ కిట్లను సర్పంచ్ భూషణం, ఎంపీటీసీ శాంతాబాయి ఆదివారం అందజేశారు. గ్రామానికి ఒక క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం యువతకు అవసరమైన క్రీడా సామగ్రిని అందజేస్తున్నదని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి మండల కన్వీనర్ రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల కార్యదర్శి గోపాల్‌రావు, నాయకులు నారాయణ్‌రావు, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యువకులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న సర్పంచ్ భూషణం

## రేపు నరేంద్రస్వామి పాదుకల దర్శనం

పిట్లం, అక్టోబర్ 8: పిట్లంలో ఈనెల 10న నిర్వహించనున్న నరేంద్ర స్వామి పాదుక దర్శన కార్యక్రమాన్ని భక్తులు విజయవంతం చేయాలని నరేంద్రస్వామి జిల్లా నిరీక్షక్ సంజీవ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జగద్గురు స్వామి నరేంద్ర మహారాజ్ పాదుకలను పిట్లంలోని రామాలయం నుంచి ప్రధాన వీధుల్లో పల్లకీలో ఊరేగించనున్నట్లు తెలిపారు. రాజరాజేశ్వరీ ఫంక్షన్ హాల్‌లో పాదుకల దర్శనం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమావేశంలో జిల్లా అధ్యక్షుడు హన్మంతు వకీల్, జిల్లా సభ్యులు మనోహర్‌పాటిల్, తాలూకా అధ్యక్షుడు శేషారావు పాటిల్, మహిళా విభాగ్ జిల్లా అధ్యక్షురాలు అనిత, బిచ్కుంద మండల అధ్యక్షుడు సాయిలు, పెద్ద కొడప్‌గల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల సభ్యుడు కుర్మ మల్లేశ్, గంగ మల్లికార్జున్, పడిగెల సుభాష్, దత్తుమేస్త్రి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



లైబ్రరీ భవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్

నిజాంసాగర్, అక్టోబర్ 8: గ్రంథాలయాలను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్ అన్నారు. బిచ్కుందలో కొత్తగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ఆదివారం ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం పోటీ పరీక్షలతోపాటు అన్ని రకాల పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు పుస్తకాలను లైబ్రరీల్లో అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్‌పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావ్‌దేశాయ్, సొసైటీ చైర్మన్ బాలు, జడ్పీటీసీ సభ్యుడు రాజు శ్రీహరి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నాగ్‌నాథ్‌పటేల్, రైతు బంధు సమితి మండల కన్వీనర్ బస్వరాజ్‌పాటిల్, నాయకులు ధన్‌సింగ్, మహేశ్, నాగరాజు, మల్లికార్జున్ పటేల్, బొమ్మల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

***జీపీ భవనం ప్రారంభం..***

బిచ్కుంద మండలంలోని కందర్‌పల్లి గ్రామంలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎంపీపీ అశోక్‌పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేయడంతో అన్ని హంగులతో పంచాయతీ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాగ్‌నాథ్‌పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావ్‌దేశాయ్, రైతు బంధు సమితి మండల కన్వీనర్ బస్వరాజ్ పాటిల్, బాలు శ్రీహరి, సర్పంచ్ గంగారాం, ఉప సర్పంచ్ పండరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం బిచ్కుందలో బసవన్న ఆలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బసవన్న ఆలయం ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉన్నదని తెలిపారు.

# రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభం



జుక్కల్‌లో పనులను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మద్నూర్‌లో సర్పంచ్ సూర్యకాంత్

నిజాంసాగర్, అక్టోబర్ 8: జుక్కల్ మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనులను బీఆర్ఎస్ నాయకుడు నీలూపటేల్, సర్పంచ్ రాములు, సొసైటీ చైర్మన్ శివానంద్, బీఆర్ మండల అధ్యక్షుడు మాధవ్‌రావు దేశాయ్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే హన్మంత్‌షిండే కృషితో జుక్కల్ మండలంలో అనేక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. జుక్కల్‌లో రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయితే మండల కేంద్రం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హన్మంత్‌షిండేకు మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దాదారావు పాటిల్, రవికుమార్, సాయాగౌడ్, గంగాధర్, బస్వంత్‌షెట్కార్, పండరి, రాజశేఖర్, రమేశ్, రాజు, బాబా తదితరులు పాల్గొన్నారు.

***మద్నూర్‌లో..***

మద్నూర్, అక్టోబర్ 8: మద్నూర్‌లో సెంట్రల్ లైటింగ్ పనులను సర్పంచ్ దరాస్ సూర్యకాంత్ ఆదివారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.తొమ్మిది కోట్లు మంజూరు చేయగా.. పనులకు ఎమ్మెల్యే షిండే ఇటీవల శంకుస్థాపన చేశారు. కాగా నిర్మాణ పనులను సర్పంచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ విఠల్, సొసైటీ మాజీ చైర్మన్ పాకల విజయ్‌కుమార్, నాయకులు కుషాల్, శివాజీ, సాయి, హన్మాండ్లు, రాజు, దేవీదాస్, బలిరాం, సాయిలు, ముక్తాయర్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీ జవాన్‌కు సన్మానం

డొంగ్లీ, అక్టోబర్ 8: మండలంలోని మొగా గ్రామానికి చెందిన సతీశ్‌గౌడ్ అగ్నివీర్‌లో ఆర్మీ జవాన్‌గాఎంపికయ్యాడు. అతడు శనివారం రాత్రి ఇంటికి రాగా.. గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ సూర్యకాంత్ పాటిల్ అతడికి శాలువా కప్పి మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో నారాయణ, హన్మంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.



జవాన్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ సూర్యకాంత్ పాటిల్

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గాంధారి, అక్టోబర్ 8: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఎస్సై ప్రేమ్‌దీప్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు వాహన ధ్రువపత్రాలతోపాటు డ్రైవింగ్ లైసెన్సును కలిగి ఉండాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దని, ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా సౌండ్ సిస్టంను ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్లపై వాహనాలను నిలిపి ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని తెలిపారు. తనిఖీలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## గోపాల్‌పేటలో దర్గా ఉత్సవాలు

ఎల్లారెడ్డి, అక్టోబర్ 8: నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలోని పీరానే పీర్ గౌసె ఆజం దస్తగిరి హజ్రత్ జిలానీ దర్గా ఉత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపేట జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, సంతోష్‌గౌడ్, యాదగిరి, రాజిరెడ్డి, వంశీగౌడ్, ఫరీద్, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న నాగిరెడ్డిపేట జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

## బాధిత కుటుంబానికి
## ఆర్థిక సహాయం అందజేత

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 8: ఎల్లారెడ్డి పట్టణంలోని ఒకటో వార్డు ఎర్రమన్నుకుచ్చ కాలనీకి చెందిన అల్లం రాములు ఇటీవల ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే జాజాల సురేందర్ రూ.పది వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన డబ్బులను మృతుడి భార్య లచ్చవ్వకు బల్దియా చైర్మన్ కుడుముల సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్ అల్లం శ్రీను ఆదివారం అందజేశారు. మృతుడికి కూతురు, కొడుకు ఉన్నారని, వారి బీద స్థితిని అర్థం చేసుకొని ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్యేకు కౌన్సిలర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్‌కుమార్, అల్లం పండరి తదితరులు ఉన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న బల్దియా చైర్మన్, కౌన్సిలర్